# గౌతమీగాథలు

ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

భీమవరం స్టేషన్‌లో రైలు దిగేసరికి గంట లేటు. చరచర స్నాన పానాదులు ముగించుకుని సభలోకి వెళ్ళేసరికి ఉదయం 9 అయింది. సభ ప్రారంభమై జరుగుతోంది. సభాధ్యక్షులు మల్లాది రామమూర్తి శాస్త్రిగారని జ్ఞాపకం. శాస్త్రిగారు మంచి ఆయుర్వేద వైద్యులు- అటు వసంత కుసుమాకరాన్ని ఎంత పసందుగా తయారు చెయ్యగలరో, ఇటు ఉత్తర రామ చరిత్ర రసపర్ణయం అంత అధికారికంగా నిర్వహించగలరు.

ఎంత సాహిత్య ప్రియులో అంత మంచి వక్త!

సభలో అడుగుపెట్టే సరికి- శ్రీనివాసరావు, విశ్వేశ్వరరావు, రుక్మిణీనాథం ఖణాయించి కూర్చున్నారు. వాళ్ళను చూడగానే ప్రాణం లేచివచ్చింది. రాత్రి రైల్లో నిద్రలేని బద్ధకం అంతా పటాపంచలై ఉత్సాహం పొంగుకొచ్చింది

రుక్మిణీనాథం హఠాత్తుగా లేచొచ్చి కౌగలించుకున్నాడు. బాపిరాజుగారు అటు- ఎక్కడినుంచో రావడంచేత, అతిథి ఇటు ఆహూరివా డవడం చేత అతిధేయుడూ అయి, రెండు హోదాల్లో హుషారుగా తిరుగుతున్నారు.

పుత్తడి బొమ్మలాంటి 14ఏళ్ళ చిన్నది హార్మోనియం మీద 'పుత్తడి బొమ్మ పూర్ణమ్మ' పాట పాడుతోంది. ఆ పిల్లలో 'పూజారింటను పుట్టిన చిన్నదాన్ని' ఊహించుకుని కళ్ళు చెమ్మగిలుతున్నాయి. తర్వాత ఒకటి రెండు ప్రసంగాలు జరిగాయి. అధ్యక్షోపన్యాసం ఒక గంట సాగి ఆ పూట సభ ముగిసింది.

సారస్వత సమాజం వార్షిక సభలు—

కార్యదర్శి సూర్యనారాయణమూర్తిగారింట్లో ఆతిథ్యం.

అంతా చేరి పద్యం- గేయం- కవిత్వం, నాటకం— ఒకటేమిటి—సర్వ సారస్వత శాఖల మీదా—ఆ కవి ముఖాన— మరీ తీవ్రంగా చర్చిస్తున్నాం. హాల్లో పదార్థాల సువాసన తగిలేకొద్దీ- మాలో రసజ్ఞత పెరిగిపోతోంది.

పిలుపు వచ్చింది. భోజనాలవుతున్నాయి.

## రైల్వే సుందరి

భోజనాలో గోదావరీ వైభవం, వైవిధ్యం, సురుచిజ్ఞత, స్పష్టంగా పరుచుకుని కనిపిస్తున్నాయి. 'మొగి విరిపి కరకు గూడక' అని శ్రీనాథుడు వర్ణించినలాంటి అరటాకుల్లో పదార్థాలు చవులూరిస్తున్నాయి. 'ఎద్దానిగ్గ కొందు, ఎద్దానిన్ వీడుదునోయి చిన్నన్నృపతీ' అనాలనిపిస్తోంది.

రామమూర్తి శాస్త్రులుగారు స్వీటు తింటూ ప్రారంభించారు- "నేను జైల్లో ఉన్నప్పుడు కొందరు మిత్రులు ఉపనిషత్తుల పాఠం చెప్పమంటే తరచి తరచి చెప్పాను.

ఎందుకో నా మీద కసి బయలేరింది వారికి-

'మాండూక్యం'లోంచి 'ముండకం'లోకి దిగి అంతా 'కాఠకు'లై ఎదురు తిరిగారు.

ఈ ఉపనిషత్తులన్నీ తగలబెట్టాలన్నారు.

ఈ వేదాంతమే కొంపముంచిందన్నారు.

ఆశ్చర్యపడి నవ్వుకున్నాను.

ఎవరి కొంప?

బోధించిన ఋషులదా? బోధింపబడిన శిష్యులదా?" అంటూ రామమూర్తిశాస్త్రిగారు ఆగారు.

రుక్మిణీనాథం పకపక నవ్వుతూ "ఆ ఇద్దరికీ కొంపలు లేవు ముందు మీ కొంప- అపాత్రులికి బోధించి మీ పాత్ర పోగొట్టుకున్నారు."

అంతా విరగబడి నవ్వేశాం. శాస్త్రులు గారు నవ్వుతూ భోజనం ముగించి—

"నిజం" అన్నారు, ముక్తసరిగా—

అంతా లేచాం.

మధ్యాహ్నం సభకు అడవి బాపిరాజు గారు అధ్యక్షులు. బాపిరాజు అందరికీ బావ. అయితే నాకు అన్న. మేమిద్దరం ఒకవూరి వారి అల్లుళ్ళం. ఆయన చుట్టరికానికి రామచంద్రపురం వస్తే- తరుచు మా యింటిదగ్గరే కాలక్షేపం

బాపిరాజు ఛలోక్తులతో, గేయాలతో పట్టలేని ఆప్యాయతతో. మాట్లాడుతూ ఉంటే ఉపన్యాసంలా లేదు. ఆత్మబంధువుల సల్లాపంలా ఉంది. ఏ సభలో నైనా- వచ్చిరి ముగ్గురు సరాబులూ- ఒకడికి కాళ్లే లేవు. ఒకడికి నోరే లేదు. అనే జానపద గేయం పాడందే ఆయన ప్రసంగం ముగిసినట్టు కాదు.

తర్వాత శ్రీనివాసరావు, విశ్వేశ్వరరావు మధ్య మధ్య వ్యాఖ్యానిస్తు తమ గేయాలు చదివారు. విశ్వేశ్వరరావు గేయప్రియుడు. ఆయన చేతిలో అప్పుడే ప్రచురించిన 'కల్యాణ కింకిణి' అనే గేయ సంపుటి కొత్తగ నిగనిగలాడుతూ కనిపించింది. మంచి సౌందర్యారాధకుడు, మిత భాషి. ఆయన నడుస్తూ ఉంటే- బెంగాలీ ఒయ్యారంతో ఒక గేయం నడిచిపోతూన్నట్టుండేది. 'శాంతిబొనేర్ గాగొవ మొదు బాసనా.'

పద్మరాజు సాహిత్యరంగంలోకి కొత్తగా దిగిన రోజులు- చదివిన సైన్సును పక్కన బెట్టి జానపదరీతిలో మంచిగేయం వ్రాసుకొచ్చి చదివినట్టు జ్ఞాపకం!

రుక్మిణీనాథం, నేనూ వరండాలో నిలబడి వింటున్నాం. అతనికి ఇల్లు లేదు! వాకిలి లేదు. బ్రతుకంతా సాహిత్యమే! నేను అంతక్రితం వారంరోజులనాడు అతనికి రాసిన ఉత్తరంలోని సాహిత్య మీమాంస అంతా తుచ తప్పకుండా ఒప్ప జెబుతున్నాడు. రావణా జ్ఞాపకం! ఉత్తరా లుత్తరాలు ఒప్ప జెప్పగలడు. మావంతు వచ్చింది. వెళ్ళి నేను భవభూతి మీదా, అతడి నవ్యకవితలో సరికొత్త పోకడలమీదా మాట్లాడాను.

సభ ముగిసింది.

మరునాడు ఉదయం తిరుగుప్రయాణాల సందడి. అంతా భీమవరం స్టేషన్‌లో చేరాం.

బాపిబావ మా కందరికీ పెద్దఖ ఖులాసా కబుర్లు చెబుతున్నాడు. కాఫీ తాగుతున్నాం.

అంతా వున్నారు. విశ్వేశ్వరరావు కనిపించలేదు. రుక్మిణీనాథం "విశ్వం శశ్వత్ ఖిద్ధకసుడు" ఏడీ ఆయన? అంటూ వెతుకుతున్నాడు.

బాపిరాజు కొంటెతనం కదిలింది! "చూడు- రుక్మిణీనాథం! పాట్‌ఫారం మీద అటూ ఇటూ రెండు రైళ్ళు నిలిచి ఉన్నాయి, అందమైన అమ్మాయి ఏ రైలు బోగీలో వుంటే అందులోనే ఎక్కి వెళ్ళిపోగలడు. ఒప్పున వెదుకు." అన్నాడు. కాఫీ కప్పు కేసి చూసి నవ్వుతూ - పక్క షాపులో

(56 వ పేజీ చూడండి)




## గోరా

[నాస్తికుని జీవితం : రచన : వల్లభనేని కాశీవిశ్వనాథం; ప్రచురణ : నాస్తిక కేంద్రం పటమట, విజయవాడ-520 006; 272 పేజీలు; వెల ; సాదా ప్రతి;రూ. 15.లు, మేలు ప్రతి రూ. 25 లు]

'గో' అంటే ముందుకు పోవటమే గాని 'రా' అంటే వెనక్కురాని పట్టుదల గల మనిషిగా 'గోరా' గారిని ఒక పత్రికా రచయిత అభివర్ణించారు. ఉన్నత విద్య నభ్యసించి సుఖ జీవితం గడపటానికి వీలున్నా, తాను నమ్మిన నాస్తికత్వ ప్రచారానికి జీవితమంతా వినియోగించిన త్యాగధనులు శ్రీ గోపరాజు రామచంద్రరావు.

ఆయన జీవిత చరిత్ర అంతా పోరాటాల మయం. దైవం పేరిట జరుగుతున్న అన్యాయాల నెదిరించటంలో, మూఢనమ్మకాలను చెదరగొట్టడం, పార్టీ రహిత ప్రజాస్వామ్య ప్రచారంలో, మంత్రుల, పరిపాలకుల ఆడంబరాలను వ్యతిరేకించటంలో, పూలమొక్కలకు బదులు కూరగాయలనే పెంచమనటంలో ఆయన విరామమెరుగని పోరాటాలు సలిపారు. ఆయన కోరిన ఫలితాలు సమకూరకపోయినా నమ్మిన విశ్వాసాలకై దీక్షగా పోరుసల్పిన ధన్యజీవి శ్రీ గోరా. ఆయన సంకల్పశుద్ధిని, పట్టుదలను గమనించిన శ్రీ చలం "గోరాను మించిన ఆస్తికుడు లేడ"న్నారు.

వల్లభనేని కాశీవిశ్వనాథంగారు గోరా గారి జీవితాన్ని జననం నుంచి మరణందాకా- వివిధ ఘట్టాలలో ఆయన వ్యక్తిత్వ వికాసాన్ని చక్కగా వివరించారు. ఐతే మంత్రుల బూటకపు వాగ్దానాల్ని నమ్మి తలపెట్టిన ఉద్యమాన్ని విరమించి, సత్యాగ్రహాన్ని నీరుగార్చిన గోరా వైఫల్యాన్ని, యింకా వివిధ సందర్భాలలో ఆయన జరిపిన ఆందోళనలలోని లోపాల్ని కాశీవిశ్వనాథంగారు విమర్శించలేదు.

ఆర్థిక అసమానతలు తగ్గించడానికి నాస్తికత్వం కన్న ముఖ్యమైన మార్క్సిస్టు తత్వశాస్త్రాన్ని ఆయన ఎందుకు విశ్వసించలేదో విశ్వనాథంగారు వివరించలేదు.

శ్రీ గోరా కార్యదీక్షలో ఆయనకు పూర్తి సహకారాన్ని యిచ్చిన ఆయన భార్య సరస్వతి గారిని గురించి, ఇంకా వారి తొమ్మిది మంది సంతానాన్ని గురించి, బంధుమిత్రుల తోడ్పాటును అవసరమైనంత మేరకు రచించారు.

నాస్తికోద్యమాన్ని గురించి తెలుసుకోవటానికి, ఒక విశిష్ట వ్యక్తి ఉజ్వల జీవితాన్ని ఆదర్శంగా గ్రహించటానికి తప్పకుండా యీ పుస్తకం చదవాలి.

## శ్రీ విష్ణు పురాణం

[ఒకటవ రెండవ అంశాలు; వాడుక తెలుగు వచనం; అనువాదకుడు: ఏలూరిపాటి అనంతరామయ్య; ప్రచురణ ; అనంత సాహితి; డాక్టర్ కె వి. కె. సంస్కృత కళాశాల వద్ద; 3/3 అరండల్ పేట; గుంటూరు-522 002: 444 పేజీలు : వెల: రూ10 .లు]

జైమినీ భారత అనువాదంతో ప్రారంభించి పురాణాలను వాడుక తెలుగు వచనంలోకి పరివర్తింపజేస్తున్న శ్రీ ఏలూరిపాటి అనంతరామయ్య 'శ్రీ విష్ణుపురాణం'లోని ఒకటవ, రెండవ అంశాలను, 444 పేజీల గ్రంథాన్ని చౌకగా పది రూపాయలకే అందిస్తున్నారు.

శ్రీ విష్ణుపురాణానికి ముందు చదువవలసిన ముఖ్యవిషయాలను శ్రీ అనంతరామయ్య ఆసక్తికరంగా రచించారు. విష్ణుపురాణ శ్లోక సంఖ్య, సాహిత్యదృష్టిలో విష్ణుపురాణం, దాని వ్యాఖ్యలు మొదలైన అంశాలతో జిజ్ఞాసువులకు మేలు చేశారు.

సాహిత్యపరమైన ఆనందం పొందగోరే వారికి శ్రీ విష్ణు పురాణం ఏమంతగా యింపుగొలపదు. పుణ్యంకోసం చదివేవారికి మాత్రం ఇందులోని వచన రచన సరళ సుందరంగా, భక్తిభావభరితంగా సాగుతుంది

ఈ పురాణాన్ని చౌకగా అందించడంలో తోడ్పడిన పొట్లూరి శ్రీవెంకటేశ్వర్లు గారి కుటుంబ సభ్యులు భక్తులకు మేలు చేశారు

—రామమోహనరాయ్

## గౌతమీ గాథలు

(4వ పేజీ తరువాయి)

సిగరెట్లు, ఒక ఇంగ్లీష్ మేగజిన్ కొనుక్కొని మా వెనకనే నిలుచుని ఉన్నాడు విశ్వేశ్వరరావు. మేం చూచుకోలేదు.

ఆయన ముందుకువచ్చి అంత కన్న కొంటెగా- "బాపిరాజుగారూ నేనూ ఒక్క రైలు ప్రయాణీకులమే. ఆయన బెజవాడ: నేను 'ఉండి'".

గుడివాడరైల్లో- ఆ 'మబ్బు రంగు సిల్కుచీరా, వానిటీబాగ్' ఎక్కిన అయిదవ బోగీలో ప్రయాణం చెయ్యడానికే ఆయన తప్పకుండా మనస్సులో నిశ్చయించి ఉంటారు. నేనూ ఆయన అడుగుజాడల్లోనే పయనిస్తాను. అంతా ఘల్లున నవ్వులు!

బాపిరాజుగారు ఖులాసాగా, స్పోర్టివ్‌గా నవ్వేసి రైలుదగ్గరికి కదిలారు. ●

## గీతగోవిందం

### దక్షిణ నాయకుడు

అనేకమంది భార్యలున్నా అందర్నీ సాదరంగా చూస్తాడు. చిన్నభార్యలమీద ప్రేమ ఉన్నా పెద్ద భార్యను గౌరవిస్తాడు. ఈ లక్షణాన్ని కృష్ణుడిలో ఎన్నోసార్లు రాధ చూసి ఉంటుంది. అందుకే రాధ ఇలా ఊహ చేసింది.

హస్త స్రస్త విలాస వంశ మనృజు
భ్రూవల్లి మద్వల్లవీ
బృందోత్సాహి దృగంత వీక్షిత
మతి స్వేదార్ద్రి గండస్థలమ్ ॥
మాముద్వీక్ష్య విలజ్జితస్మిత సుధా
ముగ్ధాననం కాననే
గోవిన్దం వ్రజసున్దరీ గణవృతం
పశ్యామి హృష్యామి చ॥

"నేను వెళ్ళాననుకో, చేతిలోని వేణువు జారిపోతుంది. చుటూ ఉన్న గోపికలంతా కనుబొమలు వంగగా "ఏం చేస్తాడిప్పుడితడు?" అని కుతూహలంతో, ఉత్సాహంతో అతణ్ని చూసూ ఉంటారు. అతడి చెంపలు చెమర్చి ఉంటాయి. నన్ను చూసి సిగ్గుపడి తప్పయిపోయింది అన్నట్టు అమాయికంగా బిక్కమొగం పెట్టిన గోవిందుణ్ణి (ఊహలో) చూస్తున్నాను. ఆ ముఖం చూస్తే నాకు సంతోషమయిపోతోంది."

—సూరంపూడి

చిత్రం పక్కపేజీలో

Printed and Published by K. L. N. Prasad at Andhra Printers Ltd., Vijayawada-10
Editor : Puranam Subrahmanya Sarma.